క్లుప్తంగా

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు అందించాలని తెలిపారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన

నందిగామ:పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంగ్లిషు భాష ప్రాధాన్యం పెరిగింది



జగ్గయ్యపేట అర్బన్:నేటి పోటీ ప్రపంచంలో యువత ఇంగ్లిషు భాష నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఆదివారం పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన కింగ్స్ ది ఇంగ్లిష్ స్కూల్‌ను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలంటే ముఖ్యంగా ఇంగ్లిష్ భాషలో ప్రావీణ్యం ఉండాలన్నారు. పోటీ పరీక్షల్లో నెగ్గాలన్నా, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు పొందాలన్నా ఇంగ్లిష్ భాషలో అనర్గళంగా మాట్లాడగలిగి ఉండాలని తెలిపారు. పట్టణంలో ఇలాంటి స్కూల్‌ను ఏర్పాటుచేసినందుకు కింగ్స్ ది ఇంగ్లిష్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. స్కూల్ డైరెక్టర్ వడ్డేపల్లి అమరనాథ్, తపోవన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్ ఉపయోగకరం



నందిగామ:టైలరింగ్ మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మాగల్లు ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మినేని శోభారాణి అన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలో మాతృశ్రీ మహిళా మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మహిళలకు రెండు నెలల పాటు టైలరింగ్ పై ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తయిన నేపథ్యంలో ఆదివారం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఆలోచనతో ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. ముఖ్యంగా టైలరింగ్ లాంటివి నేర్చుకోవడం వలన మహిళల ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు రజియా బేగం, సూపర్వైజర్ శైలజ , శిక్షకురాలు రామలక్ష్మి, గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి ప్రారంభం



చందర్లపాడు(నందిగామ టౌన్):చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. చందర్లపాడు మండలం రామన్నపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చిని బిషప్, ఫాదర్‌లతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ జీసెస్ చూపిన ప్రేమ మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అనంతరం అరుణకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పలువురు నాయకులు, పలువురు గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కంచికచర్ల : ముందుగా వెళ్లుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొనగా మహిళ రోడ్డుపై పడి స్వల్పగాయాలయిన ఘటన ఆదివారం జరిగింది. మండలంలోని పేరకలపాడు గ్రామానికి చెందిన స్వరూప నందిగామ వైపు నుంచి కంచికచర్ల వైపుకు స్కూటీపై వెళుతుండగా మండలంలోనీ కీసర బీజేటీ డిగ్రీ కళాశాల సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని బాధితురాలికి ప్రథమ చికిత్స అందజేశారు. ఆమె పరిస్థితి బాగానే ఉందని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

కోలాహలంగా నిమజ్జనాలు



నందిగామ కృష్ణబలిజ నగర్‌లో గణనాథునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



పెనుగంచిప్రోలులో పూజలందుకుంటున్న గణనాథుడు

కంచికచర్ల : చలువ పందిరిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోలీస్ స్టేషన్ సమీపంలో వాణిజ్య గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెట్రోలు బంక్ సెంటర్‌లో బాల వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద కమిటీ సభ్యులు పూజలు చేసి అన్న సమారాధన చేశారు. మోడల్‌కాలనీలో వినాయకుడికి భక్తులు పూజలు చేశారు.

గంగమ్మ ఒడికి గణనాథులు...

వేదాద్రి(జగ్గయ్యపేట):గ్రామంలోని కృష్ణానదిలో ఆదివారం వినాయక నిమజ్జనాలు కోలాహలంగా సాగాయి. గ్రామాల్లో దాదాపు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న గణనాథులను ఊరేగింపుగా తీన్‌మార్ వాయిద్యాలతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక వాహనాలపై నిమజ్జనానికి కృష్ణానదికి తరలించారు. నది వద్ద యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు పర్యవేక్షణలో ప్రత్యేకంగా ఫంటు ఏర్పాటు చేసి గణణాదుల నిమజ్జనాలు చేయించారు. ఒక్కరోజే 50 విగ్రహాలకు పైగా నిమజ్జనానికి తరలివచ్చాయి.

పెనుగంచిప్రోలు:గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణపతి మండపం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.అలాగే పలు మండపాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, పూజలు నిర్వహించారు.

పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక

నందిగామ టౌన్:తెలుగు పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. పట్టణంలోని కృష్ణబలిజ నగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథునికి ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా నిమజ్జన సమయంలో ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు పాటించటంతో పాటు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం సమీపంలోని శివనాగేంద్ర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. గణనాథుని మంటపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు విశ్వనాథపల్లి కృష్ణారావు, వీసం దుర్గారావు, పలువురు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు..

వీరులపాడు: వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులు నిమజ్జనానికి తరలాయి. జుజ్జూరు, పెద్దాపురం , జయంతి, తదితర గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో కొలువుదీరిన గణనాథులకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి దంపతులతో అర్చకులు పూజలు చేయించారు. ఆదివారం రాత్రికి పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారిని గ్రామ వీధుల్లో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నిమజ్జనాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా నందిగామ రూరల్ సీఐ నాగేంద్రకుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



కృష్ణానది వద్ద గణనాథుని నిమజ్జనంలో భక్తులు

కోలాహలంగా గణనాథుల నిమజ్జనాలు

జగ్గయ్యపేట అర్బన్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణేష్ నిమజ్జన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ కూడళ్లలోని చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహాలు అట్టహాసంగా నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన ఊరేగింపులో యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగులు చల్లుకున్నారు. గణేష్ మహరాజ్‌కు జై అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల్లో సాగిన నిమజ్జన ఊరేగింపులు వేదాద్రిలో కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు తరలివెళ్లాయి. అలాగే నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పలు మండపాల్లోని గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక రైతు బజారులోని విగ్రహం వద్ద పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, ఎస్టేట్ ఆఫీసర్ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో.....

నిమజ్జనోత్సవాలలో భాగంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యాలయం సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు గణపతి బొప్పా మోరియా అంటూ సందడి చేశారు. ముందుగా మండపంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం పట్టణ, మండల అధ్యక్షులు ఆవాల భవానీప్రసాద్, బజారు సాయి తదితర నాయకులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఐ జానకీరామ్, ఎస్ఐలు రామారావు, బందోబస్తు నిర్వహించారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

నందిగామ:గణపతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కావడంతో నిమజ్జన కార్యక్రమాలు జోరుగా సాగాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పట్టణంలో గణనాథుల ఊరేగింపు కనులపండువగా నిర్వహించారు. రైతుపేట, నెహ్రూనగర్, పాత బస్టాండ్, తదితర ప్రాంతాల్లోని గణనాథులను మేళ తాళాలు, కోలాటం నృత్యాలు, డీజే పాటలతో ప్రధాన కూడళ్లలో ఊరేగింపు నిర్వహించారు. పలుచోట్ల మహిళలు కూడా సాంప్రదాయ పాటలకు స్టెప్పులు వేశారు. అర్ధరాత్రి వరకు పట్టణంలో సందడి వాతావరణ కనిపించింది. ఎటుచూసినా గణనాథుల నిమజ్జనోత్సవాల సందడి కన్పించింది.



పేటలోని ముక్త్యాల రోడ్‌లో నిమజ్జనానికి ఊరేగింపుగా తరలివెళుతున్న గణనాథులు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలోని గణేష్ విగ్రహం వద్ద పూజలో పార్టీ నాయకులు



రైతుబజారులో గణనాథుని పూజా కార్యక్రమంలో శ్రీకాంత్, ఈవో తదితరులు



నిమజ్జన ఊరేగింపులో నాయకులు, కార్యకర్తలు



ట్రాక్టర్లపై ఊరేగింపుగా వస్తున్న గణనాథులు



ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న మహిళలు

జుజ్జూరులో ప్రభుత్వ కార్యాలయాలు

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

జుజ్జూరు(వీరులపాడు):పరిపాలనా సౌలభ్యంతో పాటు మండల ప్రజల ఆకాంక్ష మేరకు వీరులపాడు మండల కేంద్రాన్ని ప్రభుత్వం జుజ్జూరుకు మార్చటంతో ఆయా ప్రభుత్వ కార్యాలయాలు జుజ్జూరుకు తరలివస్తున్నాయి. మండల వ్యవస్థ ప్రారంభ సమయంలో మండల కేంద్రంగా జుజ్జూరును ప్రకటించినప్పటికీ రాజకీయాల కారణంగా వీరులపాడుకు మార్చటం జరిగిందని ప్రజలు పేర్కొంటున్నారు. వీరులపాడు మండల కేంద్రం మండలానికి చివరన ఉండటంతో పాటు సరైన వసతులు, సౌకర్యాలు లేకపోవటంతో ప్రజలతో పాటు అధికారులు సైతం అవస్థలు పడుతున్నారు. రవాణా సౌకర్యం కూడా అంతంతమాత్రంగా ఉండటంతో ప్రభుత్వ పనులపై మండల కేంద్రానికి వెళ్లి రావాలంటే ఒకరోజు పడుతుండటంతో పని మానుకుని వెళ్లాల్సి వస్తుందని పలువురు చెబుతున్నారు. ఇదే తరుణంలో గత ఎన్నికల ముందు మండలంలో పాదయాత్ర నిర్వహించిన ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లకు సమస్య వివరించగా అధికారంలోకి వచ్చిన తరువాత విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించి ముఖ్యమంత్రి వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్చటం అభినందనీయమని ప్రజలు అంటున్నారు.



జుజ్జూరులో ఏర్పాటైన తహసీల్దార్ కార్యాలయం

దశాబ్దాల కల సాకారం....

మండల కేంద్రంగా జుజ్జూరును మార్చటంతో మండలంలోని ఆయా శాఖల ప్రభుత్వ కార్యాలయాలు జుజ్జూరులో ఏర్పాటవుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జుజ్జూరు గ్రామం మండలంలోని గ్రామాలకు మధ్యన ఉండటంతో పాటు రవాణా, తదితర వసతులు ఉండటంతో ప్రజలు అవస్థలు తీరనున్నాయి. ఇప్పటికే తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు మండలానికి వచ్చాయని మిగిలిన శాఖల కార్యాలయాలు కూడా త్వరితగతిన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దశాబ్దాల నాటి కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, కృషి చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సోదరులకు జుజ్జూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రజల అవస్థలు తీరాయి



ప్రభుత్వ పనులపై మండల కేంద్రమైన వీరులపాడు వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వచ్చేది. రవాణా సౌకర్యం ఉండేది కాదు. పని మానుకుని ఒక రోజు కేటాయించాల్సి వచ్చేది. వీరులపాడు మండల కేంద్రాన్ని ప్రభుత్వం జుజ్జూరుకు మార్చటంతో ప్రజల అవస్థలు తీరాయి.

చలమల దుర్గారావు, చట్టన్నవరం

అన్ని కార్యాలయాలు రావాలి



మండల కేంద్రంగా జుజ్జూరును మార్చిన తరువాత తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను జుజ్జూరులో ఏర్పాటు చేశారు. మిగిలిన శాఖల ప్రభుత్వ కార్యాలయాలు త్వరితగతిన జుజ్జూరుకు వచ్చేలా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

వెల్లంకి పద్మారావు

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్:జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం ద్వారా భూముల రీ సర్వే నిర్వహించి భూముల సమస్యలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో రైతులకు ఆదివారం ఆయన జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ భూరికార్డులను తారుమారు చేయటానికి వీలు లేకుండా ప్రభుత్వం డిజిటల్ రికార్డులు తయారు చేసిందన్నారు. అంతే కాకుండా భూహక్కు పత్రాల్లో క్యూ ఆర్ కోడ్, మ్యాపింగ్ ఫొటోలు, విస్తీర్ణం, సర్వే నంబర్‌లతో సహా అన్ని వివరాలు ముద్రించటం జరిగిందని తెలిపారు. సుమారు వందేళ్ల తరువాత ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వే నిర్వహించారని తెలిపారు. రీ సర్వే వల్ల సరిహద్దు వివాదాలతో పాటు భూములకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రీసర్వే పనులు దాదాపుగా తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆయా గ్రామాల్లోని రైతులకు సైతం భూహక్కు పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, సర్పంచ్ చాగంటి రవికిరణ్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు



నందిగామ పట్టణంలో కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి

నందిగామ: ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు అన్నారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి తిరుమలరావు మాట్లాడుతూ కార్మికుల కోసం ప్రత్యేకంగా అనేక చట్టాలు ఉన్నాయని చెప్పారు. వాటిపై ప్రతి కార్మికుడు కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్మికులకు కూడా చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా కార్మికుల సంక్షేమం కోసం ఉన్న చట్టాలు, వాటిని ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



నందిగామ వాసవి మార్కెట్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం



రజక బజారులో నిర్వహిస్తున్న సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు

నందిగామ:డివిజన్ వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఎపట్టణంలోని వాసవి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వంద మందికి పైగా దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణ కార్యక్రమాన్ని చేయించారు. వేద పండితుల మంత్రాలు, సాంప్రదాయ మేళ తాళాల నడుమ సీతారాముల కల్యాణ కార్యక్రమం కనుల పండుగగా జరిగింది. నాలుగవ వార్డు పరిధిలో రజక బజారులో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలతో పాటు సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు నిర్వహించారు. పట్టణంలోని ముక్కోటి మండపంలో ఏర్పాటు చేసిన పర్యావరణ గణపతి వద్ద ప్రత్యేక పూజలతో పాటు లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ కార్యక్రమం వైభవంగా జరిగింది. అదేవిధంగా పలు కూడళ్లలో ఏర్పాటుచేసిన చవితి పందిళ్ళ వద్ద విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

పర్యాటక కేంద్రంగా ఊర చెరువు అభివృద్ధి

–మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, నాయకులు, అధికారులు

జగ్గయ్యపేట అర్బన్:పర్యాటక కేంద్రంగా ఊర చెరువును అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఆదివారం ఊర చెరువు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట ఊర చెరువును ఖమ్మంలోని లకారం, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ మాదిరిగా అభివృద్ధి చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపొందించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విజన్ అని తెలిపారు. ఇప్పటికే చెరువు చుట్టూ ప్రహరీ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ తదితర పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. త్వరలో ఈ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాశీ కిషోర్, కాకర్ల లక్ష్మీనారాయణ, మున్సిపల్ డీఈ, ఏఈలు శివకోటేశ్వరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన రైతు భరోసా కేంద్రాలు



అనిగండ్లపాడులో రైతు భరోసా కేంద్రాలు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రాల భవనాలు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. ఒక్కొక్క భవనం రూ.21.80 లక్షలతో మొత్తం రూ.43.60 లక్షలతో రెండు భవనాలు నిర్మించారు. ఇప్పటికే ఆర్‌బీకేలు విశేష సేవలందిస్తున్నాయని రైతులు అంటున్నారు. నూతనంగా గ్రామంలో రెండు భవనాల నిర్మాణంతో రైతులకు మరింత మేలు కలుగుతుందని అంటున్నారు. ఆర్‌బీకేలతో పాటు ప్రాథమిక సహకార పరపతి సంఘం గోడౌన్‌ను సుమారుగా రూ.11 లక్షలతో మరమ్మతులు నిర్వహించారు. వీటిని కొద్ది రోజుల్లో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను చేతుల మీదుగా ప్రారంభిస్తామని సర్పంచ్ బి జ్యోతిబ్రహ్మం, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు తెలిపారు.

బీసీలకు సబ్ కోటా రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న ఆరేపల్లి వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట అర్బన్:దేశంలో 50 నుంచి 55 శాతం ఉన్న బీసీలకు ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీలకు సబ్ కోటా గురించి తెలియజేయకపోవడం రాజ్యాంగ విరుద్ధం అని పట్టణ బీసీ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది ఆరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక సీతారామపురంలోని బీసీ సంఘ కార్యాలయంలో ఆరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 55 శాతం ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మహిళా బిల్లులో మార్పులు చేసి బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘ నాయకులు పోటూరి గోవిందరావు, దేవరకొండ శ్రీను, తూమాటి కృష్ణ, వెంకట్, చాపల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.